క్లుప్తంగా

వసతి గృహాన్ని సందర్శించిన బీసీడబ్ల్యూఓ


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న నాగరాణి

ఏలూరు (టూటౌన్): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిక అధికారిణి (బీసీడబ్ల్యూఓ) డి.నాగరాణి శనివారం మధ్యాహ్నం స్థానిక గ్లేవియర్ నగర్‌లోని బీసీ కాలేజ్ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థినులతో ముచ్చటించారు. కొత్త మెనూ అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ని విద్యార్థినులకు తెలియజేశారు. విద్యార్థినుల అకడమిక్ రిపోర్ట్స్‌ను గురించి తెలుసుకున్నారు. వసతి గృహ సంక్షేమాధికారిణి ఎస్ ఝాన్సీలక్ష్మీబాయి సిబ్బందితోనూ మాట్లాడారు. ప్రకారం మెనూను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం బీసీడబ్ల్యూఓ విద్యార్థినులకు భోజనం వడ్డించారు.

చీరలు, పంచెల ఆదాయం రూ.32 వేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన వస్త్రాలు, చీరలకు శనివారం వేలం వేశారు. 78 చీరలు, 41 పంచెలను వేలం వేయగా రూ.32,815 ఆదాయం వచ్చింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రస్టీలు కూరాళ్ల రమాదేవి తదితరులు వేలం నిర్వహించగా, కార్యక్రమాన్ని కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు పర్యవేక్షించారు.


లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి


అభ్యర్థుల సర్టిఫికెట్లను ఆన్‌లైన్ చేస్తున్న పోలీసు సిబ్బంది


లాంగ్‌జంప్‌లో పాల్గొన్న అభ్యర్థి


ఎస్సై దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్


అభ్యర్థి ఛాతి కొలతలు తీస్తున్న సిబ్బంది


1600 మీటర్ల పరుగులో పాల్గొన్న అభ్యర్థులు

ఎస్సై దేహదారుఢ్య పరీక్షలకు 800 మంది

ఏలూరు రేంజ్ పరిధిలో సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పోస్టుల భర్తీకి అభ్యర్థులకు శనివారం ఐదో రోజూ ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 800 మంది పురుష అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ నేతృత్వంలో ఎత్తు, ఛాతి, 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖరరాజు, ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, డీటీసీ డీఎస్పీ కే.ప్రభాకరరావు, జీవీఎస్ పైడేశ్వరరావు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

ఏవీఎస్ జిల్లా అధ్యక్షుడిగా పూర్ణచందు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా చేకుర్తి పూర్ణచందు నియమితులయ్యారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో ఎంకామ్ మొదటి సంవత్సరం చదువుతోన్న పూర్ణచందును ఇటీవల నెల్లూరులో జరిగిన ఏవీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తురకా ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పూర్ణచందు మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తురకా ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బతికి.. సాధించాలి

సమస్య ఏదైనా క్షణికావేశంలో నిండు ప్రాణాలు బలితీసుకుంటున్న ఘటనలు సమాజంలో క్రమంగా పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. పరీక్షల్లో తప్పారనో, ఉద్యోగం రాలేదనో, ప్రేమ విఫలం అయ్యిందనో, కుటుంబ కలహాల వల్లనో అర్ధాంతరంగా జీవితాలను చిదిమేసుకుంటున్నారు. బలవన్మరణాలకు పాల్పడుతున్నవారిలో ఎక్కువగా యువత, అందులోనూ వ్యసనాలకు లోనైన వారు, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు ఉంటున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి కౌన్సెలింగ్, మెరుగైన వైద్య సేవలను అందిస్తోంది.


ఏలూరు జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డులో డీ.ఎడిక్షన్ సెంటర్‌లో బాధితులను పరామర్శిస్తున్న వైద్యులు


మానసిక రోగులకు పరీక్షలు చేస్తున్న సైక్రియాట్రిస్ట్ డాక్టర్ కె.హన్నా కోమలి

- ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు
- క్షణికావేశంతో నిర్ణయాలు సరికాదు
- ఆత్మహత్యల నివారణ దిశగా ప్రభుత్వం చర్యలు
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

ఏలూరు టౌన్/భీమడోలు : ఏదో ఒక కష్టం, నష్టం, ఆవేదన, ఆవేశం, ఉక్రోశం, ఆందోళన.. తీవ్ర భావోద్వేగాలకు లోనై నిరాశ నిస్పృహలకు గురై సమాజంలో ఒంటరిగా మిగిలిపోయామనో ఆత్మహత్యకు పురిగొల్పుతున్నాయి. సమస్యలను ఎదుర్కొలేని మానసిక బలహీనతే ఆ పని చేయిస్తుంది. మనోవేదనతో అర్ధాంతరంగా తనువు చాలిద్దామనేలా వారిలో ఆలోచన రగిలేలా చేస్తోంది. పోటీతత్వంతో చదవలేక విద్యార్థులు.. సెల్‌ఫోన్ చూడనివ్వలేదని తల్లిదండ్రులపై అలిగి.. ప్రేమలో విఫలమై యువతీ, యువకులు.. అత్తింట వేధింపులు తట్టుకోలేక.. ఆర్థిక పరిస్థితుల కారణంగా.. మోసం చేశారనో.. వ్యసనాల బారిన పడో ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. జీవితంలో ఎటువంటి అనుభూతులను ఆస్వాదించకుండానే నిండు జీవితాన్ని అధికశాతం యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. జీవితంలో ఓడిపోయామని, మనం ఏమి సాధించలేమనే నిరాశ నిస్పృహలతో యవ్వనంలోనే నిండు జీవితాన్ని ముగిస్తూ కుటుంబ సభ్యులకు కన్నీరుమిగిలిస్తున్నారు. ఆత్మహత్యల నివారణకు మానసిక వైద్య నిపుణులు, ప్రభుత్వాలు ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆత్మహత్యల నివారణకు జుడీషియల్ విభాగం సైతం న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్ని చైతన్యపరుస్తోంది.

ఆత్మహత్యలు చేసుకునే వారి ఆలోచనలు ఇలా

పదే పదే ఆత్మహత్యలపై మాట్లాడుకోవడం, తనకు తానే హాని కలిగించుకునేందుకు ప్రయత్నించడం, తీవ్ర ఒత్తిడితో చికాకు పడడం, ఒంటరి జీవితాన్ని ఇష్టపడడం, నిరాశా నిస్పృహాలు, ప్రతి విషయాన్ని ప్రతికూలంగా ఆలోచించడం, నిద్రలేమి అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం, ఇలాంటి మార్పులు ఒక వ్యక్తితో కనిపిస్తే ఆత్మహత్య గురించి ఆలోచనలు చేస్తున్నట్లు భావించాలని మానసిక వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా 15 నుంచి 80 సంవత్సరాల వయస్సు వరకు ప్రతి ఒక్కరూ ఏదోక సందర్భంలో ఆత్మహత్య చేసుకోవాలన్న బలహీన క్షణాలను ఎదుర్కొనే ఉంటారు. మానసిక ఒత్తిడికి గురవతున్న మహిళల్లో కూడా ఇటువంటి ఆలోచనలు ఎక్కువే. మహిళలు కన్నా పురుషులే ఎక్కువగా ఆత్మహత్యలు పాల్పడుతుండగా, వారిలో గ్రామీణ ప్రాంతాల్లో వారే ఎక్కువ.

స్నేహపూర్వక మాటలతోనే తొలి చికిత్స

ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచించే వారిని గుర్తించిన వెంటనే వారిలో సాధ్యమైనంత త్వరగా స్నేహపూర్వకంగా మాట్లాడాలి. వారికి కుటుంబ సభ్యులు, స్నేహితులు దైర్యం చెప్పాలి. మంచి మాటల ద్వారా అండగా ఉన్నామనే భరోసా ఇచ్చే ప్రయత్నం చేయాలి. ఓపికగా వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలి. వారి చెప్పే సమస్యలు అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను చూపాలి.

నెలకు 20 నుంచి 30 కేసులు

ఏలూరు జీజీహెచ్‌కు నిత్యం ఆత్మహత్యాయత్నం, ఆత్మహత్య కేసులు నెలలో సుమారుగా 20 నుంచి 30 వరకూ వస్తూ ఉంటాయి. వీటిలో 50శాతానికి పైగా యువత ఉంటున్నారు. ఆత్మహత్యాయత్నం కేసులు ఏడాదికి 2 వేలకు పైగా ఉంటుండగా, వీటిలో సుమారుగా 100 నుంచి 180 మంది వరకు ఆత్మహత్య కేసులు ఉంటున్నాయి. ఏలూరు జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగం ప్రత్యేక శ్రద్ధతో ఆత్మహత్యాయత్నం కేసుల్లో బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తూ భరోసా కల్పిస్తోంది. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి, మత్తుపదార్థాలు, గంజాయి, మద్యం వంటివాటికి బానిసలైన వారికి కౌన్సెలింగ్, చికిత్స అందిస్తూ వారిలో మార్పుకు కృషి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానసిక వైద్యం కోసం చేరిన రోగుల వివరాలు

సంవత్సరం	రోగులు	డిప్రెషన్ కేసులు	మానసిక ఆందోళన	మద్యం, డ్రగ్స్ కేసులు
2021–22	4828	880	783	3165
2022–23	3749	759	1231	1759

టోల్‌ఫ్రీ 14416 కు కాల్ చేయండి



జీవితం చాలా విలువైంది. మానసిక సమస్యలకు ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నాం. టెలీ మానస పేరుతో టోల్ ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేస్తే వారికి ఆన్‌లైన్‌లో నిష్ణాతులైన మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇస్తారు. పరిస్థితి తీవ్రంగా ఉంటే స్థానిక ఆశా వర్కర్, ఏఎన్ఎంలకు సమాచారం ఇచ్చి వెంటనే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స అందిస్తారు.

– కె.శ్రీనివాసరావు, సైకాలజిస్ట్, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఏలూరు

ప్రతి సోమ, శుక్రవారం ఉచిత పరీక్షలు



ఆత్మహత్య ఆలోచన సరికాదు. జీవితాన్ని సవాల్‌గా తీసుకుని జీవిస్తున్న వారు ఎందరో. మానసిక ఆరోగ్యం సరిగ్గా లేనివారికి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. ప్రతి సోమవారం, శుక్రవారం ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంటాం. మిగిలిన రోజుల్లో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వెళ్లి పరీక్షలు చేసి ఉచితంగా మందులిస్తున్నాం.

– డాక్టర్ కె.హన్నా కోమలి, మానసిక వైద్యురాలు, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఏలూరు

భరోసా కల్పించాలి



ఆన్‌లైన్ గేమ్స్ యువత, విద్యార్థులపై పెను ప్రభావాన్ని చూపిస్తున్నాయి. సమస్యలు, ఇబ్బందులు, మానసిక ఒత్తిడి, కష్టాలు ఎదురైతే తమ బాధను కుటుంబ సభ్యులు, స్నేహితులు, హితులకు చెప్పుకోవటం ద్వారా ఆత్మహత్య చేసుకోవాలనే భావనను దూరం చేస్తుంది. దీనివల్ల ఆత్మహత్యలను సాధ్యమైనంత మేర నిలువరించే అవకాశం ఉంది.

– డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్, హెచ్‌వోడ్, జీజీహెచ్ ఏలూరు

17 నుంచి మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు


సమావేశంలో పాల్గొన్న అహలె సున్నతుల్ జమాత్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక వన్ టౌన్ హజరత్ మౌలాలి ముష్కిల్ కుషా అస్థాన (గొలుసుల పంజా)లో జష్నే ఈదే మీలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ఈనెల 17 నుంచి 28 తేదీ వరకు నిర్వహించనున్నట్టు అహలె సున్నతుల్ జమాత్ ఏలూరు కార్యదర్శి గొలుసులు పంజా వంశపార్యంపర ముజావరులు ఎండీ గాలబ్‌అలి తెలిపారు. దర్గాలో అహలె సున్నతుల్ జమూత్ నాయకులు, సభ్యుల సమావేశం శనివారం నిర్వహించారు. గాలబ్‌అలి మాట్లాడుతూ ఉదయం ఏడు గంటల నుంచి పేషే ఇమాములు (మత గురువులు) ఖురాన్ పారాయణం చేస్తారని, దరూద్ సలాం, ఫాతెహా ఖాని, నిత్యం ఉదయం, సాయంత్రం 6.30 నుంచి హుజూర్ మహమ్మద్ ప్రవక్త చరిత్ర సీరత్ నబీ గ్రంథ పఠనం చేస్తారని తెలిపారు. భక్తులందరూ పాల్గొని మహమ్మద్ అడుగుజాడల్లో నడిచి ఇహ పరలోకాల్లో సాఫల్యం పొందాలని కోరారు. వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఆరిఫ్ మాట్లాడుతూ జమాత్ గత మూడేళ్ల నుంచి మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. మతాలకు కులాలకు అతీతంగా కలిసిమెలిసి ఉంటేనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని, శాంతి నెలకొని ఉంటుందని అన్నారు. సమావేశంలో అహలే సున్నతుల్ జమాత్, ఏలూరు అధ్యక్షుడు ఎండీ సాబీర్ హుస్సేన్, జాయింట్ సెక్రెటరీ ఎండీ బాబు భాయ్, సభ్యులు ఎండీ ఇక్బాల్, ఎస్‌కే జానీ, ఎండీ ఉస్మాన్ దౌలా, ఎస్‌కే ఖైరుల్లాహ్ షరీఫ్, కార్యకర్తలు సయ్యద్ సుల్తాన్, ఎస్‌కే జానీ పంజా వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలి, ఎండీ మౌలాఅలి, ఖాదర్ అలి, ఎండీ మున్వర్ అలీ, ఎండీ షాహిద్ అలీ, ఎండీ నాసర్ అలీ, ఖాజా అలి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'పాడనా తీయగా'


పాడనా తీయగాలో పాట పాడుతున్న ఔత్సాహిక గాయని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీత దర్శకుడు ఎస్‌పీఎస్ వాసు శనివారం నిర్వహించిన పాడనా తీయగా కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. ఔత్సాహిక గాయనీ గాయకులను ప్రోత్సహించేందుకు, వారికి టీవీలు, సినిమాల్లో అవకాశం కల్పించే నిమిత్తం శనివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో పాడనా తీయగా కార్యక్రమం నిర్వహించారు. సంగీత దర్శకుడు వాసు బృందం సంగీత సహకారం అందించగా ఎంపిక చేసిన సుమారు 15 మంది గాయకులు తమ ప్రతిభ ప్రదర్శించారు. వివిధ చిత్రాల్లోని జనరంజక పాటలు శ్రావ్యంగా ఆలపించారు. తొలుత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ప్రస్తుత రోజుల్లో యువతీ, యువకులు వివిధ రంగాల్లో ఎంతో ప్రతిభ చూపుతున్నారని, వారికి సరైన అవకాశాలు కల్పించడం ద్వారా వారి అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే వివిధ టీవీ చానళ్లు ఔత్సాహిక ప్రతిభావంతులను ప్రోత్సహిస్తుండగా స్థానికంగా ఉండే ఇటువంటి సంస్థలు కూడా వారిని ప్రోత్సహించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న గాయకులు భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలు పొంది పేరుప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

12,13 తేదీల్లో మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

పెదవేగి : అండర్–14, –17 బాలబాలికలకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సీహెచ్ బుద్ధవాస్ శనివారం తెలిపారు. మండలంలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు కబడ్డీ, కోకో, వాలిబాల్, త్రోబాల్, షటిల్, టెన్నికాయిడ్, యోగ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 12న పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకులంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న కొప్పాక ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తారని ఎంఈఓ తెలిపారు. వివరాలకు మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సెల్ నెంబర్ 63001 03545ను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.